## నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్‌: ఫీడర్‌ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్‌ సెక్షన్‌ ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయిబాబానగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయిబాబానగర్‌, వాజ్‌పేయినగర్‌, పద్మానగర్‌ ఫేజ్‌–2, నాగులకుంట, ఎం.ఎస్‌.రెడ్డి నగర్‌ ఫేజ్‌–2. అలాగే 11 కేవీ బ్యాంక్‌కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాంక్‌ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎం.ఎన్‌. రెడ్డి నగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

**కొంపల్లి సెక్షన్‌ పరిధిలో..**

కుత్బుల్లాపూర్‌: ఫీడర్‌ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్‌ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. దూలపల్లి సబ్‌స్టేషన్‌ 11 కేవీ ఐడీఏ–2 ఫీడర్‌ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యూ స్టీల్‌ సిటీ, ఎస్‌వీఎస్‌ కాంటా, దూలపల్లి పరిధిలోని రోడ్డు నంబర్‌ 16, 14, ఏబీసీ రోడ్డు 13, 10, 9, 6, 5ఏబీ, 11 కేవీ కేకే సొసైటీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామిరెడ్డినగర్‌, రేణుకా ప్లాస్టిక్‌, మహదేవ వేబ్రిడ్జి తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

**శంకర్‌ ఫీడర్‌ పరిధిలో..**

చింతల్‌: లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ న్యూ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్‌ శంకర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రంగారెడ్డినగర్‌ రోడ్డు నంబర్‌–10, రామ్‌రెడ్డి కాలనీ, మైత్రీవనం కాలనీ, గౌరీనగర్‌, హెచ్‌ఏఎల్‌ కాలనీ, రామరాజునగర్‌, శంకర్‌ ఎన్‌క్లేవ్‌, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్‌ జయనగర్‌ ఫీడర్‌ పరిధిలో జయనగర్‌, గల్ఫ్‌ బేకరీ, కడకపుర, కేఆర్‌నగర్‌, నేతాజీనగర్‌, మూవ్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌, చిన్నతోకట్ట, విట్టల్‌నగర్‌ , జానకీనగర్‌. సంచారపురి ఫీడర్‌ పరిధిలో సంచారపురి కాలనీ, పబ్లిక్‌ సెక్టర్‌ కాలనీ, ఉమానగర్‌ , రిలయన్స్‌ విల్లా, ముస్లిం గ్రేవ్‌ యార్డ్స్‌, తెలంగాణ గార్డెన్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## స్కూల్‌ బస్సు డ్రైవర్‌పై పోక్సో కేసు

కుత్బుల్లాపూర్‌: చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూల్‌ బస్‌ డ్రైవర్‌పై పేట్‌బషీరాబాద్‌ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని ఉజ్వల్‌ హైస్కూల్‌లో చదువుతున్న ఐదేళ్ల చిన్నారిపై పాఠశాల బస్సు డ్రైవర్‌ శ్రీనివాస్‌ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. సోమవారం బస్సు ఎక్కేందుకు చిన్నారి మారం చేసింది. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని ఆరా తీయగా డ్రైవర్‌ విషయం బయట పడింది. చిన్నారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చూపించిన తల్లిదండ్రులు పేట్‌బషీరాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్‌: 131 డివిజన్‌ బాపునగర్‌వాసురాలు పరిపటి అజిత ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.60 వేల ఆర్థిక సాయం మంజూరు చేసింది. సంబంధిత చెక్కును కొలన్‌ హన్మంత్‌రెడ్డి బాచుపల్లిలోని కాంగ్రెస్‌ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న కారు

–ఒకరి మృతి, మరొకరికి గాయాలు

దుండిగల్‌: కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన దుండిగల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్‌ జిల్లా నర్సాపూర్‌ మండలం దోమడుగు గ్రామానికి చెందిన రాజుగౌడ్‌ (35)అతని స్నేహితుడు పోచయ్య నగరంలోని మహంకాళి జాతరకు వచ్చారు. తిరిగి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై తమ గ్రామానికి వెళ్తున్నారు. దుండిగల్‌ ఓఆర్‌ఆర్‌ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ నడుపుతున్న రాజుగౌడ్‌ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా పోచయ్య గాయపడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చురుగ్గా కల్యాణ మండపం పనులు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టపై ఉన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన కల్యాణ మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ కమిటీ, దాతల సహకారంతో సుమారు రూ. 90 లక్షలతో పనులు కొనసాగుతున్నాయి. 4 నెలల్లో కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రజావాణిలో 25 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్‌: జంట సర్కిళ్ల పరిధిలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్‌ ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారంలో ఇంజినీరింగ్‌ విభాగంపై 2 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌లో 14 ఫిర్యాదులు రాగా వాటిలో అధికంగా టౌన్‌ ప్లానింగ్‌–9 ఇంజినీరింగ్‌ 5 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించి వారంలోగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. గోదావరి హోమ్స్‌ పరిసర ప్రాంతాల్లోని కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమించి ప్రహరీలు నిర్మించి ఆక్రమిస్తున్నారని, వాటిని తొలగించాలని కోరుతూ స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధి మాధవరెడ్డి కాలనీవాసులు కలిసి ఉప కమిషనర్‌ నరసింహకు ఫిర్యాదు చేశారు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేస్తే స్పందించలేదని వారు పేర్కొన్నారు. తక్షణమే ఆక్రమణకు గురవుతున్న స్థలాలను కాపాడాలని వారు కోరారు.

**వాటర్‌వర్క్స్‌ కార్యాలయంలో 9 ఫిర్యాదులు**

చింతల్‌: కుత్బుల్లాపూర్‌ వాటర్‌ వర్క్స్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు వచ్చాయని జీఎం మాధవి తెలిపారు. కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని 1, నల్లా కనెక్షన్‌, బోరు మోటర్లకు మరమ్మతులు చేపట్టాలని 2, రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయాలని, మ్యాన్‌హోళ్లపై మూతలు ఏర్పాటు చేయాలని 1, మరో 3 ఫిర్యాదులు లో ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతుందని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీజీఎంలు వికాస్‌, రవి, మేనేజర్లు, ఎలక్ట్రికల్‌ మేనేజర్‌ తదితరులు పాల్గొన్నారు.



ఉప కమిషనర్‌ నరసింహకు ఫిర్యాదు చేస్తున్న మాధవరెడ్డి

## వైభవంగా వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని కూన మహాలక్ష్మీనగర్‌లో గల నల్ల పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చన, అలంకరణతో పాలు ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు జగన్‌, మంత్రి సత్యనారాయణతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## కల్లు తాగి మతిస్థిమితం కోల్పోయి..

జీడిమెట్ల: కల్లు తాగిన భార్యాభర్తలు పిచ్చిగా ప్రవర్తించిన ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా గోపాల్‌ తండాకు చెందిన భార్యాభర్తలు దరావత్‌ లచ్చిరాం, సాక్రేబాయ్‌ 2 రోజుల క్రితం గాజులరామారంలోని కూతురు ఇంటికి వచ్చారు. వీరికి కల్లుతాగే అలవాటు ఉంది. కాగా వీరి కుమారుడు నిశాంత్‌ సైతం ఐడీఏ జీడిమెట్లలోని రాంరెడ్డినగర్‌లో ఉంటాడు. కుమారుడి దగ్గర ఉన్నప్పుడు స్థానికంగా ఉన్న రాంరెడ్డినగర్‌ కల్లు కంపౌండ్‌కు వెళ్లి కల్లు తాగేవారు. గాజులరామారంలో ఉండడంతో వీరికి కుమారుడు షాపూర్‌నగర్‌లోని ఓ కల్లు కంపౌండ్‌ నుంచి కల్లు తీసుకెళ్లి ఇవ్వగా వారు తాగేవారు.

**మత్తు తగ్గడమే కారణం..?**

ఇటీవల కూకట్‌పల్లిలో కల్లు తాగి కొంతమంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అయితే కల్లు దుకాణాల్లో ఎక్సైజ్‌ అధికారుల తనిఖీలు పెరగడంతో కల్లులో దుకాణాదారులు మత్తు తక్కువగా కలుపుతున్నారు. షాపూర్‌నగర్‌లోని కల్లు కంపౌండ్‌ కల్లు సేవించగా వీరికి మత్తు సరిపోక పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారు. దీంతో కుటుంబసభ్యులు దంపతులకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి రెగ్యులర్‌గా కల్లు తాగే చోట తాగించాలని చెప్పి ఇంటికి పంపించారు.



108లో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

నిజాంపేట్‌ : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు కొలన్‌ గోపాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 25న నిజాంపేట్‌లోని జర్నలిస్ట్‌ కాలనీలో గల చర్ల ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే బోనాలకు హాజరుకావాలని కోరుతూ ఆ కాలనీవాసులు సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ జర్నలిస్ట్‌ ముక్కర్ల లాలయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

## సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి



నిజాంపేట్‌: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని పీఆర్‌టీయూటీఎస్‌ మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్‌ పేర్కొన్నారు. బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, అత్యున్నత విద్యార్హతలున్న ఉపాధ్యాయులు ఉండడం, డిజిటల్‌ ఎడ్యుకేషన్‌ ఏఐ టెక్నాలజీ వినియోగంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడిందన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక, అలాగే సరిపడా తరగతి గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్‌, బాచుపల్లి మండల శాఖ అధ్యక్షుడు పర్మగల్ల నర్సిములు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌ కుమార్‌రెడ్డి, పి.శేఖర్‌, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, శివప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

సుభాష్‌నగర్‌: కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ పేర్కొన్నారు. టీపీసీసీ లేబర్‌ సెల్‌ మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ లేబర్‌ సెల్‌ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లేబర్‌ సెల్‌ ప్రధాన కార్యదర్శి దువ్వూరి తేజశ్వరరావు, వైస్‌ ప్రెసిడెంట్లు చెవిటి శ్రీనివాస్‌, కంచగారు దుర్గయ్య కొంపల్లి మున్సిపాలిటీ లేబర్‌ సెల్‌ ప్రెసిడెంట్‌ దండు నరేంద్ర రాజుకు నియామక పత్రాలు అందజేసిన శ్రీశైలంగౌడ్‌ వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ కార్మిక విభాగాన్ని బలోపేతం చేసి కార్మికులకు అన్ని సదుపాయాలు అందేలా చూడాలన్నారు. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ లేబర్‌ సెల్‌ అధ్యక్షుడు కావలి గోపాల్‌ ముదజిరాజ్‌, కాంగ్రెస్‌ నాయకులు ఆంజనేయులు, కమ్మరి భాస్కర్‌ తదితరులు ఉన్నారు.



దండు నరేంద్ర రాజుకు నియామక పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌

## పార్క్‌ స్థలం కబ్జాకు యత్నం

- 30 మంది బౌన్సర్లతో హల్‌చల్‌
- గేట్లు, స్టేజీ, పిల్లల ఆట వస్తువుల ధ్వంసం



స్థలంలోని ఆట వస్తువులు తొలగిస్తున్న దృశ్యం

నిజాంపేట్‌: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి బాచుపల్లి మండలం నిజాంపేట్‌ బృందావన్‌ హిల్స్‌కాలనీ సమీపంలో సర్వే నంబర్‌ 93 ప్రభుత్వ స్థలంలోని 30 గుంటలను గతంలో స్థానికుల అవసరాల కోసం కేటాయించారు. అందులో ఇప్పటికే 2 వేల గజాల వరకు కబ్జాకు గురికాగా ప్రస్తుతం 1500 గజాల స్థలంలో పార్కు ఉంది. ప్రస్తుతం భూమి విలువ పెరిగేసరికి సదరు స్థలాన్ని 3 ఏళ్ల క్రితం కబ్జాకు యత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా వెనుకడుగు వేశారు. తిరిగి మళ్లీ సోమవారం సుమారు 30 మంది బౌన్సర్లతో పార్కు వద్దకు చేరుకుని హల్‌చల్‌ చేశారు. పార్క్‌ గేట్లు, స్టేజీ, పిల్లల ఆట వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బాచుపల్లి రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ కొందరు తిరిగి ఆక్రమించే పనిలో నిమగ్నమయ్యారు. రెవెన్యూ అధికారులు మరోసారి రంగంలోకి దిగి ఇది ప్రభుత్వ స్థలం అని, ఆక్రమణదారుల వద్ద సదరు స్థలానికి సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే చట్టబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు.



రెవెన్యూ అధికారులు, పోలీసులను అడ్డుకుంటున్న దృశ్యం

## దశలవారీగా అభివృద్ధి పనులు

కుత్బుల్లాపూర్‌: దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలం గౌడ్‌ పేర్కొన్నారు. గాజులరామారం డివిజన్‌ పరిధిలోని రావి నారాయణరెడ్డినగర్‌, దేవేందర్‌నగర్‌, బతుకమ్మ బండ ప్రాంతాల్లో సోమవారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రావి నారాయణరెడ్డి నగర్‌ ఫేస్‌–2 లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 84 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. కొంతమంది కాంగ్రెస్‌ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, కార్యకర్తలు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, మౌలిక వసతుల విషయమై మంత్రి శ్రీధర్‌ బాబును కలిసి విన్నవించగా నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సాయిప్రసాద్‌, మురళి, లక్ష్మయ్య, పూలమ్మ, జహంగీర్‌, మహేశ్‌, ఎల్లారెడ్డి, సంగయ్య, నరేందర్‌ రెడ్డి పాల్గొన్నారు.



రావి నారాయణరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్‌

## భూకబ్జా రాయుళ్లకు చెక్‌..!

ప్రభుత్వ స్థలాల చుట్టూ ప్రహరీల నిర్మాణం

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జగద్గిరిగుట్ట రాజీవ్‌ గృహకల్పకు అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం కొంతకాలంగా కబ్జా అవుతున్నట్లు పలు ఫిర్యాదులు రావడంతో వాటి చుట్టూ ప్రహరీని నిర్మిస్తున్నారు. ఇటీవలే పోలీస్‌ స్టేషన్‌ సమీపంలో కూడా ప్రహరీ నిర్మించడం కబ్జాలకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది.



## 42 శాతం రిజర్వేషన్‌ అమలు నిర్ణయం చరిత్రాత్మకం



సమావేశంలో మాట్లాడుతున్న గూడ ఐలయ్య

జగద్గిరిగుట్ట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ అమలు చేయడం చరిత్రాత్మకమని కాంగ్రెస్‌ నాయకుడు గూడ ఐలయ్య గౌడ్‌ అన్నారు. జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌లోని కార్యాలయంలో కాంగ్రెస్‌ నాయకుడు జనార్దన్‌ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అత్యుత్తమ గౌరవం కల్పించిన సీఎం రేవంత్‌ రెడ్డికి బీసీలంతా రుణపడి ఉంటారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్‌ బిల్లును ఆమోదించాలన్నారు. త్వరలోనే సీఎం గారికి అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేవంత్‌ రెడ్డి యువసేనా సాయి ప్రవీణ్‌ గౌడ్‌, మహిళా నాయకులు సులోచన, జయమ్మ, తిరుపతమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని క్లీన్‌సిటీగా మార్చుతాం

నిజాంపేట్‌ : నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ను క్లీన్‌ సిటీగా తీర్చిదిద్దేందుకు, అలాగే సీజనల్‌ వ్యాధుల నివారణకు '100 రోజుల స్పెషల్‌ డ్రైవ్‌' చేపట్టినట్లు మున్సిపల్‌ సిబ్బంది తెలిపారు. నిజాంపేట్‌ వార్డు నంబర్‌ 10, 11లలో సోమవారం యాంటీ లార్వా దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ సిబ్బంది పాత టైర్లు, కొబ్బరికాయలు తదితర వాటిని పరిశీలించి వాటిలోని నిల్వ నీటిని పారబోశారు. అదేవిధంగా వార్డు నంబర్‌–3లో శిల్పా పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, స్వయం సహాయక బృందాలు, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం



## రేకుల పైనుంచి పడి వ్యక్తి మృతి



అన్సార్‌

జీడిమెట్ల: పరిశ్రమ పైకప్పు రేకులు తీస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్‌కు చెందిన మహ్మద్‌ అన్సార్‌ (29) రోజువారీ కూలీ పనులు చేస్తుంటాడు. సోమవారం ఉదయం జీడిమెట్ల ఫేజ్‌–3లోని జగదాంబ బాక్స్‌ పరిశ్రమలో పాత రేకులు తీసేందుకు పనికి వెళ్లాడు. పనులు చేస్తుండగా మధ్యాహ్నం 3 గంటలకు అన్సార్‌ ప్రమాదవశాత్తు రేకు విరిగిపోయి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పాపిరెడ్డినగర్‌లోని బీ బ్లాక్‌ రోడ్డు నంబర్‌ 1,2లలో భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి నరసింహులు ముదిరాజ్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ పేర్ని ధర్మారావు, అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్‌, నాయకులు లక్ష్మీకాంత్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం..!



జగద్గిరిగుట్ట : శ్రీనివాస్‌నగర్‌ మీసేవ కేంద్రం సమీపంలోని బస్టాప్‌ వద్ద ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ ఫెన్సింగ్‌ లేకపోవడం, వైర్ల బాక్సులకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎప్పుడూ ఏం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## చెట్ల కొమ్మలు తొలగించరూ..!



జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం ముందు..

విద్యుత్‌ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఆ శాఖ అధికారులు ఇటీవల తొలగించారు. కానీ వాటిని తరలించే విషయం మాత్రం మర్చారు. దీంతో పలు కాలనీలో వారం రోజులుగా రోడ్లపైనే కొమ్మలు ఉంటున్నాయి. సంబంధిత సిబ్బంది స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –జగద్గిరిగుట్ట



కల్పన సొసైటీ రోడ్డులో ఉన్న చెట్ల కొమ్మలు

## బోనాలకు సదుపాయాలు కల్పించండి

నిజాంపేట్‌ : బోనాలకు సదుపాయాలు కల్పించాలని కోరుతూ వివిధ డివిజన్ల కాంగ్రెస్‌ అధ్యక్షులు నిజాంపేట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శానిటేషన్‌, లైటింగ్‌, ఆలయాన్ని పూలతో అలంకరించడం, సాండ్‌ బాక్స్‌ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో కమిషనర్‌ సానుకూలంగా స్పందించి ఏఈ ప్రవీణ్‌కుమార్‌, శానిటేషన్‌ ఇన్‌చార్జి సుకృతారెడ్డిని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీరబాబు, పి.రమేశ్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రఫత్‌, లింగమూర్తి, నాగరాజు, రవీంద్రరావు, జనార్దన్‌, రత్నరాజు, రామ్‌ నరసయ్య, రమేశ్‌, తులసీదాస్‌ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు విన్నవిస్తున్న నాయకులు